క్లుప్తంగా

విద్యార్థికి అభినందన



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి జతీన్ ఇటీవల నిర్వహించిన రామన్ ఐఐటీ టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో విద్యార్థిని పలువురు అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థి అయిన జతిన్ జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని సంపాదించడంపై తెళ్లరాళ్లపల్లి లిటిల్‌స్టార్ హైస్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ శేఖర్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. రామన్ ఐఐటీ నిర్వాహకుడు రాములు విద్యార్థిని సన్మానించి మెమొంటో అందజేశారు.

ఉర్సును జయప్రదం చేద్దాం



అమరచింత: పట్టణంలో వెలసిన సయ్యద్ షా రాజావళి దర్గా షరీఫ్ ఉర్సులో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా అన్నారు. రాజావళి దర్గా కమిటీ సభ్యులతో కలిసి ఉర్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. మార్చి 10 నుంచి 12 వరకు జరిగే ఉర్సుకు సంబంధించి దర్గా పరిసరాల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నమని వెల్లడించారు. 10న గంధోత్సవం, 11న తాజే చిరాక్, 12న ఖత్మే ఖురాన్‌తో ఉర్సు ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో రఫీక్, ఇంతియాజ్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం



ఆత్మకూర్: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారనే విషయాన్ని సర్పంచ్‌లు గ్రామస్తులకు వివరించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లకు, ఆయా శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నివారణ, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడిచెత్త, ఆరోగ్యం ఇతర విషయాల గురించి వివరించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమం ముగిసిందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, ట్రెయినింగ్ కోఆర్డినేటర్లు రాజు, కుర్మయ్య, రఘు, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిర్లక్ష్యం



వనపర్తి క్రైం: ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలపై చిన్నచూపు చూస్తుందని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఈ ఎమ్మెల్సీ ఎన్నిక సెమీ ఫైనల్‌గా మారనుందని, గతంలో తను స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు 17మంది అభ్యర్థుల్లో 2వ స్థానం వచ్చిందని గుర్తు చేశారు. తన సొంతబలంతో పాటు.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీ, టీపీయూఎస్ మద్దతుతో బీజేపీ గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సబ్బిరెడ్డి, కృష్ణ, నారాయణ, మాధవరెడ్డి, భరత్‌భూషణ్, పెద్దిరాజు, ప్రవీన్, విష్ణువర్ధన్, కుమారస్వామి, సీతారాములు తదితరులు ఉన్నారు.

సీపీఎం బస్సు యాత్ర

కొల్లాపూర్: బీజేపీ మతోన్మాద విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బస్సుయాత్రలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు వెల్లడించారు. శనివారం పట్టణంలో భాస్కర్‌నాయక్ అధ్యక్షతన సీపీఎం మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పర్వతాలు మాట్లాడుతూ ఈనెల 28న జిల్లా కేంద్రంలో బస్సుయాత్ర ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. సభకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతారన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఈనెల 15 నుంచి 30 వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో మండల కార్యదర్శి శివవర్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



దావాజిపల్లిలో గుడ్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఆరోగ్య విస్తరణాధికారి

పాన్‌గల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకునేలా వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని మండల ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని దావాజిపల్లిలో సర్పంచ్ వెంకటయ్యయాదవ్ అధ్యక్షతన పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌష్టికాహారం తీసుకోవడంతో రక్తహీనత బారిన పడకుండా ఉండొచ్చన్నారు. ఆరోగ్య కార్యకర్తలు చెప్పిన సూచనలు, సలహాలు పాటిస్తూ గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుమనశ్రీ, పంచాయతీ కార్యదర్శి విజయలత, ఆశా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం కిశోర బాలికలు, బాలింతలకు పౌష్టికాహారం, గుడ్లను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల్లో రోగనిరోధక శక్తిని పెంపొందించాలన్న లక్ష్యంతో పౌష్టికాహారం అందజేస్తుందని, దీనిని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ సుగుణాబాయి అన్నారు. పౌష్టికాహారంపై ఉన్న అపోహలను నమ్మొద్దని ఆమె అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



వీపనగండ్లలో..



శ్రీరంగాపురంలో..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు బాలమృతం, గుడ్లను ఉపసర్పంచ్ శివకుమార్ శనివారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మహిళా సమైక్య అధ్యక్షురాలు అనురాధ, అంగన్‌వాడీ టీచర్ మంజులారాణి , ఆశావర్కర్ జ్యోతి బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల మంజూరుపై హర్షం



స్తంభాలకు పూజ నిర్వహిస్తున్న తండావాసులు

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌తండాకు 20 విద్యుత్ స్తంభాలు మంజూరు చేయడంపై సర్పంచ్ హేమలమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు రమేష్‌నాయక్, నిరంజన్‌నాయక్, శంకర్‌నాయక్ శనివారం హర్షం వ్యక్తం చేశారు. తండాకు వచ్చే క్రాస్ రోడ్డు నుంచి తండా వరకు ఇరువైపులా లైటింగ్ ఏర్పాటు చేయడానికి మంజూరయ్యాయని తెలిపారు. స్తంభాలకు లైటింగ్ ఏర్పాటుతో తండావాసులు క్రాస్ రోడ్డు నుంచి తండా వరకు చీకటి ఇబ్బందులు తొలుగుతాయన్నారు. స్తంభాలను మంజూరు చేయించిన కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, మంజూరుకు కృషి చేసిన ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డికి తండా వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తొలిగిన రోడ్డు నిర్మాణం అడ్డంకులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల, కాశీంనగర్ గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణానికి ఉన్న అడ్డంకులు గ్రామ బీఆర్‌ఎస్ నాయకుడు కతాల్ కృషితో తొలిగినట్లు సర్పంచ్ మంజుల, బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతయ్య, కర్ణాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. మంజూరైన రోడ్డు నిర్మాణంలో గ్రామానికి చెందిన ఓ రైతు పొలం నాలుగు గుంటల పొలానికి నష్టం జరుగుతుండటంతో ఆయా రైతు రోడ్డు నిర్మాణానికి అభ్యంతరం తెలిపారు. దీంతో కతాల్ ఆ రైతుతో మాట్లాడి తానే సొంతంగా రూ.2 లక్షలు రైతుకు ఇవ్వడంతో నిర్మాణం పనులు సాఫీగా సాగేందుకు వీలు కలిగిందన్నారు. ఈ రోడ్డు సమస్యను పరిష్కరించిన కతాల్‌ను కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

వైఎస్సార్‌టీపీ బలోపేతానికి కృషి



వనపర్తి క్రైం: జిల్లాలో వైఎస్సార్‌టీపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు జశ్వంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా తలకొండ మహేష్, ముమ్మడి చాణక్యను నియమిస్తూ నియామక పత్రాలను అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు సూచన మేరకు పార్టీ పటిష్టానికి నిరంతరం కష్టపడతామని తెలిపారు. కార్యక్రమంలో సతీష్, పరమేష్, బాలరాజు, జయకృష్ణ, తేజ్‌నాయుడు తదితరులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



పెబ్బేరు: పట్టణ సమీపంలో గల మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 100మంది విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి సొంత ఖర్చులతో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాయిస్‌ఫాతిమా, కౌన్సిలర్ సుమతి, ఎల్లయ్య, ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పాన్‌గల్: ఉపాధి విధుల నుంచి పంచాయతీ కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ శనివారం మండల పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు జీపీ విధులతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధి పనులకు సంబంధించి గతంలో ఫీల్డు అసిస్టెంట్లు లేని సమయంలో ఆయా పనులను పంచాయతీ కార్యదర్శులు నిర్వహించారని, ప్రస్తుతం ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నా మస్టర్లపైన కార్యదర్శుల సంతకం చేయాలనే నిబంధనలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. జీపీల పనులు చూసుకోవడానికి సమయం సరిపోక ఇబ్బందులు పడుతున్న తరుణంలో అదనంగా ఉపాధి పనుల నిర్వహణను చూడటం ఇబ్బందిగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతు



రహదారిలో పోసిన మట్టి

అమరచింత: పట్టణంలోని జగన్‌వాడలో గల ఇరుకైన రహదారిలో వృద్ధులు నడవలేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా రహదారికి మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించారు. జగన్‌వాడలోని కొంగరి భాస్కర్ ఇంటి పక్కన ఉన్న వీధిలో ప్రతినిత్యం కాలనీవాసులు తిరుగుతుంటారు. పక్షం రోజుల కిందట సీసీ రహదారి నిర్మించడంతో ఇరుకుగా ఉన్న వీధి రహదారి లోతట్టుకు చేరింది. దీంతో వృద్ధులు అటుగా వెళ్తూ కిందపడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కమిషనర్‌కు విన్నవించారు. దీంతో ఆయన శనివారం కాలనీకి చేరుకొని వృద్ధులు పడుతున్న ఇబ్బందులను చూసి రహదారి మరమ్మతు పనులను వెంటనే చేపట్టారు. మొరం మట్టి కప్పి, వాటిపై త్వరలోనే సీసీ వేస్తామన్నారు. కమిషనర్ సకాలంలో స్పందించినందుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజనులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలి



ప్రచారం నిర్వహిస్తున్న జగదీశ్వర్‌రావు

వీపనగండ్ల: రాబోయే ఎన్నికల్లో గిరిజన, దళితుల కుటుంబాలను కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి ప్రభుత్వ ఏర్పాటులో పాలుపంచుకోవాలని కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు అన్నారు. శనివారం నాగర్లబండ తండాలో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలను ఇచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను, విద్యార్థులను, పేదలను మోసం చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో గిరిజన, దళితులకు అనేక సంక్షేమ ఫలాలు అందాయని తెలిపారు. కార్యక్రమంలో పందెం విజయభాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

అమరచింత: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డా శరత్ ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. దగ్గు, జ్వరం, తలనొప్పి, చర్మ వ్యాధులు ఉన్న వారిని గుర్తించి మందులు అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని వసతి గృహాలను ప్రతి వారం సందర్శించి విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వసతి గృహంలోని విద్యార్థులు పాఠశాలకు రావడంతో పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో హాస్టల్ విద్యార్థులకు రక్త నమూన పరీక్షలను సైతం నిర్వహించారు. వెన్నునొప్పితో బాధపడుతున్న విద్యార్థితో పాటు కంటి చూపు సమస్యతో బాధపడుతున్న 8 మందిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి సిఫార్సు చేశామన్నారు. కార్యక్రమంలో వార్డెన్ బెనర్జి, హెచ్‌ఎం బలరాముడు, హెల్త్ సూపర్‌వైజర్లు ఆయూబ్‌ఖాన్, సురేందర్‌గౌడ్, ఏఎన్‌ఎం హైమావతి పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని బీసీ హాస్టర్ విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ రాకేష్‌రెడ్డి తెలిపారు. 20మంది విద్యార్థులకు ఆరోగ్యం సమస్యలు ఉండడంతో మందులు ఇచ్చామన్నారు. సీజన్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ శివయ్య, వైద్య సిబ్బంది రాజశేఖర్, ఆశా వర్కర్స్ రమాదేవి, జ్యోతి పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



పెబ్బేరులో..

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వీరిలో కలెక్టర్‌గా హర్షిణి, డీఈఓగా శిరీష, ఎంఈఓగా మహాలక్ష్మి, హెచ్‌ఎంగా అశోక్‌తో పాటు 30 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవుజా, ఎస్‌ఎంసీ చైర్మన్ కుర్మయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అతిక్రమించొద్దు

పెబ్బేరు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండల ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అబ్రహంలింకన్ తెలిపారు. మండల కేంద్రంలోని రంగనాథస్వామి జాతర సందర్భంగా రాజకీయ నాయకుల బొమ్మలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని సూచించారు. ఈ నిబంధనను అన్ని రాజకీయ పార్టీ నాయకులు పాటించాలని కోరారు.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకే ‘ప్రేరణ’



మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో ఉన్న ఒత్తిడి, భయాన్ని తొలిగిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రేరణ తరగతుల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలపై భయాన్ని వీడి దృఢ సంకల్పం, పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శంకరయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మంజుల, సీఆర్పీ గోవింద్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అవసరం

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని, సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ‘రాష్ట్ర ఆవిష్కార్ సప్తాహ్’ 2023 వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

నిరుపేద విద్యార్థినికి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న జెడ్పీటీసీ వెంకటరమణమ్మ

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరులో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ఇద్దరు అమ్మాయిలకు జెడ్పీటీసీ కేసిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి మేమున్నామంటూ ముందుకొచ్చారు. వారిలో మానసిక స్థితి సరిగా లేని అమ్మాయిని హైదరాబాద్ చిల్డ్రన్ కేర్ స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. ఇంకో అమ్మాయి మేఘమాల ఆర్థిక ఇబ్బందులతో చదువుకు చదువు దూరం కాకుడదనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో శనివారం బీఎస్సీ నర్సింగ్‌లో చేర్పించేందుకు ముందుకొచ్చారు. దీంతో స్థానికులు జెడ్పీటీసీ వెంకటరమణమ్మ, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తగరం లక్ష్మి, ఉపసర్పంచ్ ఆనంద్‌యాదవ్, సీనియర్ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పార్టీ ప్రెసిడెంట్ డేగ శేఖర్‌యాదవ్, కోఆప్షన్ సభ్యుడు ఖాజ, ప్రధాన కార్యదర్శి తలారి వెంకటేశ్వర్లు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధర తగ్గించే వరకు పోరాటం



ఖిల్లాఘనపురంలో నిరసన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఖిల్లాఘనపురం: కేంద్రం ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధర పెంచడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వ్యవసాయ శాఖమంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశానుసారం మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్ ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో ప్రధాన రోడ్డుపై ఖాళీ సిలిండర్లతో ఆందోళన చేపట్టారు. కట్టెల పొయితో టీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తుందని దుయ్యబట్టారు. సామాన్యులు నేడు తిరిగి కట్టెల పొయ్యి వైపు చూడాల్సిన పరిస్థితులు దాపరించాయన్నారు. అచ్చేదిన్ ఆయేగా అన్న మోడీ నేడు సచ్చేదిన్ ఆయేగా అనేలా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. పేదలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కానుకలు ఇవేనా అంటు ప్రశ్నించారు. ఇలాంటి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటరమణ, దేవేందర్ ముదిరాజ్, శేఖర్‌రెడ్డి, మండల సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ రాజు, ఎంపీటీసీ సభ్యులు ఆశాజ్యోతి, జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ సత్యం, జిల్లా నాయకులు విక్రం, కప్పెట సాయిలు, క్యామ వెంకటేష్, అంజనేయులుగౌడు, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీరంగాపురంలో..

పెబ్బేరు రూరల్: వంట గ్యాస్ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో కట్టెల పొయ్యి, ఖాళీ సిలిండర్‌తో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ గాయత్రి మాట్లాడుతూ గ్యాస్ ధరలను కేంద్రం ఇష్టానుసారంగా పెంచుతుండటంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు వినీలారాణి, నిర్మల, వెంకటేశ్వర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఆరీఫ్, ఉపసర్పంచ్ శివకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు గౌడునాయక్, వెంకటస్వామి, మహేష్‌గౌడ్, జలీల్, పృథ్వీరాజు, రాధాకృష్ణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ధర్నాలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న ఆశన్న తదితరులు

ఖిల్లాఘనపురం: కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధర పెంచిందని బీఆర్‌ఎస్ నాయకులు ధర్నాలు, నిరసన చేయడం హాస్యాస్పదమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి చెన్నూరు ఆశన్న ఎద్దేవా చేశారు. శనివారం బీజేపీ మండల యువమోర్చా అధ్యక్షుడు వెంకటరమణ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వంట గ్యాస్ ధర పెరిగిందని ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితువు పలికారు. వంట గ్యాస్ ధరపై విధించే పన్నులో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం వాటా తెలుసుకుంటే మంచిదన్నారు. ఇష్టానుసారంగా బస్సు చార్జీలు, కరెంటు బిల్లులు, రిజిస్ట్రేషన్ ఫీజులు అడ్డగోలుగా పెంచిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించినప్పుడు.. రాష్ట్ర ప్రభుత్వం రూపాయి కూడా ధర తగ్గించకుండా ప్రజలపై భారం మోపిందని మండిపడ్డారు. రాష్ట్రంలో కేసీఆర్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.